క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలి


రాములు యాదవ్

హుడాకాంప్లెక్స్: సిరీస్ ఫార్మా కంపెనీకి గత ప్రభుత్వం కేటాయించిన భూముల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాములు బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పటి బహదూర్‌గూడ ప్రస్తుతం ఎల్‌బీనగర్‌లో సిరీస్ (సౌత్ ఇండియా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌సైన్స్) ఫార్మా కంపెనీకి సర్వే నం–49/13లో 14 ఎకరాల 31 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కావునా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించి సిరీస్ కంపెనీకి నాటి ప్రభుత్వం కేటాయించిన విలువైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

గేటెడ్ కమ్యూనిటీ రోడ్డుకు నిధులు మంజూరు


కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న జైపాల్‌నాయక్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ 7వ డివిజన్‌లోని ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయి.నిధుల మంజూరుకు కృషి చేసిన స్థానిక కార్పొరేటర్ లక్ష్మారెడ్డిని బుధవారం గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షుడు డాక్టర్ నేనావత్ జ్యోతి జైపాల్‌నాయక్ పూల బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. గేటెడ్ కమ్యూనిటీ అభివృద్ధికి, గుర్రంగూడలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్న కార్పొరేటర్ జైపాల్‌నాయక్ కాలనీవాసులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

అభినందనలు



దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన సుధీర్‌రెడ్డిని ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ వాసులు మహ్మద్ అహ్మద్, ఎస్‌కే మహమ్మద్, రామాచారి, సోమేశ్వర్‌రావు బుధవారం కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసినందుకు అధిష్టానం తనను గుర్తించి ఫైనాన్స్ కమిటీలో సభ్యుడిగా నియమించిందని సుధీర్‌రెడ్డి అన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు


అలంకరణలో స్వామివారు

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే గురువారం స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వర శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా రమేశ్

తుర్కయంజాల్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా తుర్కయంజాల్‌కు చెందిన బచ్చిగళ్ల రమేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ రెండు పర్యాయాలుగా రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పని చేశాడని గుర్తు చేశారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి ఉత్సవాలు

మంచాల: నేటి (గురువారం) నుంచి ఆరుట్లలో వేణుగోపాలస్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 22న కలశ స్థాపన, అంకురార్పన చేస్తారు. 23 రాత్రి 8–00 గంటలకు కల్యాణోత్సవం, 24న అగ్ని ప్రతిష్ఠాపన, రథాంగహోమం జరగనుంది. 25 న ఉదయం రథోత్సవం ఊరేగింపు చేస్తారు. 26న హోమం, నాగవల్లి, పూర్ణాహుతి నిర్వహించనున్నారు.

రసవత్తరంగా పీఏసీఎస్ రాజకీయం!

- నేడు ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం
- ప్రిసైడింగ్ అధికారిగా డీసీఓ ధాత్రిదేవి


శేరిగూడ పీఏసీఎస్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌లపై ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో గురువారం అవిశ్వాస సమావేశం జరగనుంది. పదవి నుంచి వారిని తొలగించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ధాత్రిదేవికి 11 మంది సంఘం సభ్యులు అవిశ్వాస నోటీసులు గత నెల 31 ఇచ్చిన సంగతి తెలిసిందే. పార్టీలకు అతీతంగా సంఘం సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుదర్శన్‌రెడ్డి సంఘ చైర్మన్‌గా, క్యామ శంకర్ వైస్ చైర్మన్ కొనసాగుతున్నారు. సంఘంలోని 13 మంది సభ్యులకుగాను 11 మంది సభ్యులు ఏకమై అవిశ్వాస తీర్మానం చేశారు. అవిశ్వాస ప్రక్రియ సమావేశానికి డీసీఓ ధాత్రిదేవి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. అవిశ్వాసం నెగ్గాలంటే 2/3 మెజార్టీ అవసరం ఉంటుంది. 13 మంది సంఘం సభ్యుల్లో 9 మంది ఉంటే సరిపోతుంది.. అయితే 11 మంది చైర్మన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సుదర్శన్‌రెడ్డి

తనపై అవిశ్వాసం పెట్టనున్న నేపథ్యంలో పీఏసీఎస్ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తుంది. సహకార చట్ట నిబంధనలకు విరుద్ధంగా తనపై అవిశ్వాసం పెడుతున్నారని..ఈ ప్రక్రియను నిలిపివేయాలని న్యాయస్థానానికి వెళ్లినట్లు సమాచారం. దీనిపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు. గురువారం అవిశ్వాస సమావేశం పూర్తికాక ముందే కోర్టు నిర్ణయం వెలువడితే ఈప్రక్రియ కొనసాగుతుందా లేదో స్పష్టం అవుతుంది. అంతవరకు వేచిచూడాల్సిందే. అవిశ్వాసం నెగ్గితే వెంటనే కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ప్రిసైడింగ్ అధికారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని సమాచారం.

చైర్మన్ రేసులో పాండు రంగారెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి చెందిన టేకుల సుదర్శన్‌రెడ్డిని పదవిచ్యుతుడిని చేసేందుకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి పావులు కదిపారు. ఈ చైర్మన్ పదవిని ఆయన ఆశిస్తున్నారు. మూడేళ్ల కాల పరిమితి తర్వాత ఎప్పుడైనా పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే ఆవకాశం ఉంది. నాలుగేండ్ల కాలపరిమితి ముగిసి మరొక్క సంవత్సరం ఈ పాలకవర్గం పనిచేసే ఆవకాశమున్న నేపథ్యంలో సభ్యులు అవిశ్వాసానికి తెరలేపారు.

మునలానికి కారణం

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్ పర్సన్ కప్పరి స్రవంతిపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస నోటీసుల ప్రభావ ఫలితంగా బీఆర్ఎస్‌కు చెందిన ఉప్పరిగూడ సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పడినట్లు రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి. స్రవంతిపై అవిశ్వాసం పెట్టి తన గ్రామానికి చెందిన కౌన్సిలర్ శ్రీలతను చైర్ పర్సన్ చేయాలని సుదర్శన్‌రెడ్డి ప్రయత్నించిన కారణంగా అతని పదవికి కాంగ్రెస్ పార్టీ నేతలు ఎసరు పెడుతున్నారని అంతటా చర్చానీయాంశంగా మారింది. దీంతో రసవత్తరంగా రాజకీయాలు మారాయి.

బడుగుల అభ్యున్నతికి పాటుపడిన సుధీర్‌కుమార్


సుధీర్ కుమార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చైతన్యపురి: మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే పుంజాల సుధీర్‌కుమార్ 64వ జయంతి వేడుకలను అనంతుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పీ అండ్ టీ కాలనీ చౌరస్తాలో బుధవారం నిర్వహించారు. సుధీర్‌కుమార్ విగ్రహానికి పలువురు నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిషలు పాటుపడిన వ్యక్తి పుంజాల సుధీర్‌కుమార్ అని పలువురు కొనియాడారు. మలక్‌పేట నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుటం పురుషోత్తం రావు, నాయకులు కోట్ల శ్రీనివాస్‌పటేల్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, బద్దుల వెంకటేష్‌యాదవ్, లక్ష్మణ్, పులిపాటి త్రివేది, తోట రాజు పటేల్, క్రాంతి, నాగరాజు, కాసాని వేణుగౌడ్, విగ్నేష్, ఆకుల ప్రవీణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో అన్నదానం


అన్నదానం నిర్వహించిన మదన్‌బాబు

సైదాబాద్: దివంగత మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే సుధీర్‌కుమార్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మలక్‌పేట నియోజకవర్గం బీ-బ్లాక్ ప్రెసిడెంట్ మదన్‌బాబు అన్నారు. బుధవారం సుధీర్‌కుమార్ జయంతి సందర్భంగా ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత


ప్రమాదబీమా చెక్కును అందజేస్తున్న విక్రంరెడ్డి

మీర్‌పేట: గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పట్టణ ప్రాంత ప్రజలకు కూడా గాయత్రి బ్యాంకు సేవలందించడంలో కీలక పాత్ర పోషించడం అభినందనీయని మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారు నల్లగొండ ధన్‌రాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, బుధవారం ఆయన భార్య జ్యోతికి ప్రమాదబీమా ద్వారా రూ.1 లక్ష చెక్కును విక్రంరెడ్డి అందజేశారు. ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనూ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రమాద బీమా కల్పించడంపై విక్రంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాఖ మేనేజర్ యెద్దు శివ చంద్రబాబు, సీనియర్ ఆఫీసర్ అల్లి రమేష్, జూనియర్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాస్, కార్పొరేటర్ అనిల్‌యాదవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ పనులు ప్రారంభం


జిమ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి 27వ డివిజన్ ప్రగతిహిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో ఓపెన్ జిమ్ పనులను కార్పొరేటర్ భిక్షపతిచారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. ఓపెన్ జిమ్ పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లేష్, రాజు, భాస్కర్, కృష్ణ, రాము, ధన్‌రాజ్, రామకృష్ణ, గోపాల్, భాస్కర్‌చారి, నరేష్ పాల్గొన్నారు.

నూతన నియామకం

మంచాల: రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంతయ్య మాట్లాడుతూ.. మండలంలోని ఆస్మత్‌పూర్ గ్రామానికి చెందిన నర్ల శ్రీశైలం యాదవ్ సీపీఐ కార్యకర్తగా అంచలంచెలుగా ఎదిగి పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశాడని చెప్పారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నుంచి పార్టీ అనుబంధ సంఘాలలో పని చేయడమే కాకుండా సీపీఐ మండల కార్యదర్శి, రైతు సంఘం మండల అధ్యక్షుడి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారని గుర్తు చేశారు. పార్టీ పిలుపు మేరకు ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలపై పోరాటం చేశాడని అన్నారు. ఆయన కృషిని గుర్తించి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియామకం చేశామన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

16 ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలు


ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలో కొలువైన శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మార్చి 7 నుంచి 11 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శివగంగ ఆలయం రంగు రంగులు విద్యుత్ దీపాలతో ముస్తాబవుతుంది. గత కొన్ని రోజులగా శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలు అమర్చి సర్వంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శివగంగ ఆలయం చుట్టూ ఉన్న 16 శివాలయాలతో పాటు ఆలయం పక్కన ఉన్న స్వాగత తోరణానికి రంగులు వేస్తున్నారు. ఆలయ చైర్మన్ అల్లె కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చకచకా కానిస్తున్నారు. ఆలయం చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి, రంగుల రాట్నం ఏర్పాటుకు స్థలాలను కేటాయించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆటోల ద్వారా బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాల పంపిణీ చేసి భక్తులను భారీ ఎత్తున ఉత్సవాలకు తీసుకొచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలు అందరికి సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ అల్లె కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

మీర్‌పేట: మద్యం మత్తులో ఓ యువకుడు విద్యుత్ టవర్ ఎక్కిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. బాలాపూర్ చౌరస్తాలోని ఫుట్‌పాత్ వద్ద ఉండే రాంబాబు (30) బుధవారం రాత్రి మద్యం తాగి అక్కడే ఉన్న విద్యుత్ టవర్ ఎక్కాడు. గమనించిన స్థానికులు యువకుడు కిందకు దూకుతాడేమోనని పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసుల అభ్యర్థన మేరకు కిందకు దిగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

సఫాయి కర్మచారిల ఆర్థిక అభివృద్ధికి కృషి

కమిషనర్ సత్యనారాయణరెడ్డి


సఫాయి కర్మచారిలతో కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: సఫాయి కర్మచారిల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని పుర కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొహెడ వార్డు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సఫాయి కర్మచారిలు విధుల నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రక్ష పరికరాలను ధరించాలని, మురికి కాలువలు శుభ్రపరిచేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ అనుబంధ నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని సబ్సిడీలు పొంది ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ హరీశ్, మున్సిపల్ సిబ్బంది భానుమతి, రోజా పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి సమావేశం

తలకొండపల్లి: కల్వకుర్తి పట్టణంలోనాగర్ కర్నూల్ పార్లమెంటరీ కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం ఉ. 10 గంటలకు (ఈ నెల 23న)నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిలుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లు రవి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ్మారెడ్డిలతో పాటు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు హాజరవుతున్నారని ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని కార్యకర్తలు, బీఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

లింకు రోడ్లు బాగయ్యేదెన్నడో?

కంకర తేలి పూర్తిగా ధ్వంసం ● ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం


చాంద్‌ఖాన్‌గూడ-ఆరుట్ల రోడ్డు

మంచాల: ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన లింకు రోడ్లను బాగు చేసే నాథుడు కరువయ్యాడు. సంవత్సరాలుగా కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వమైన బాగు చేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. మంచాల మండలంలోని ఆగాపల్లి నుంచి నోముల, చాంద్‌ఖాన్‌గూడ గేట్ నుంచి బుగ్గతండా రోడ్డు వరకు, బుగ్గతండా- ఎల్లమ్మ తండా రోడ్లు ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనవి. ఈ రోడ్లను గత 20 ఏళ్ల కిందట వేశారు. అప్పటి నుంచి తిరిగి మరమ్మతులు చేసిన పాపాన పోలేదు.

బుగ్గతండా-ఎల్లమ్మ తండా..

మండల కేంద్రం నుంచి ఆరుట్ల మీదుగా బుగ్గతండా, ఎల్లమ్మ తండా, బోడకొండ, లోయపల్లి, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ రోడ్లు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. నేడు కంకర తేలి రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు పూర్తి పాడైపోవడంతో జాపాల గ్రామం మీదుగా తిరిగి ఆరుట్ల , మంచాల గ్రామాలకు చేరుకుంటున్నారు.

చాంద్‌ఖాన్ గూడ- ఆరుట్ల

చాంద్‌ఖాన్ గూడ –ఆరుట్ల రోడ్డు పాడైపోయి గత ఆరు సంవత్సరాలు అవుతుంది. బాగు చేస్తామని కంకర తొవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రజలకు నిత్యం అవసరం ఉన్న రోడ్డును తక్షణమే బాగు చేసి ప్రజల ప్రయాణాలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆగాపల్లి - నోముల..

ఆగాపల్లి- నోముల రోడ్డు వేసిన్పటి నుంచి నేటి వరకు తట్టెడు మట్టి కూడా పోయలేదు. పూర్తిగా కంకర తేలిపోయి గుంతలమయంగా మారింది. రాత్రిపూట ఈ రోడ్డు మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉన్న లింకు రోడ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన పట్టించుకోని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా మారింది



చాంద్ ఖాన్ గూడ – ఆరుట్ల రోడ్డు కంకర తొవ్వి వదిలేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిత్యం వందలాది మంది ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు. తక్షణమే బాగు చేయాలి.

- ఓరిగంటి భాస్కర్‌గౌడ్, జాపాల

చాలా గ్రామాలకు దగ్గరవుతుంది..



బుగ్గతండా- ఎల్లమ్మతండా లింకురోడ్డును బాగుచేస్తే ఎల్లమ్మ తండా, కొర్రవాణి తండా, బోడకొండ, లోయపల్లి, దాద్‌పల్లి, రంగాపూర్ గ్రామాల నుంచి ఆరుట్ల చేరుకోవడం సులభమవుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయాలి

-కొర్ర శంకర్‌నాయక్, కొర్రవాణి తండా

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల మృతులకు నివాళి


దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల మృతులకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లలో అమరులైన వారికి బుధవారం పలువురు ఘన నివాళులర్పించారు. పదేళ్ల క్రితం తీవ్రవాదులు పాల్పడ్డ దుశ్చర్యకు నిరసనగా గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, బబ్బూరి ఆనంద్‌గౌడ్, బేరబాలకిషన్, రవిచారి, రవీందర్‌రెడ్డి, యాద శంకర్, విక్కీగౌడ్, విజయలక్ష్మి, హాసిన్, ఉషా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో...


అమరులకు నివాళులర్పిస్తున్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, మనోజ్, గణేష్, కిషోర్, శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.